క్లుప్తంగా

బాధితురాలికి అండగా ఉంటాం



పరామర్శిస్తున్న బీఎన్.రావు

జగిత్యాల/మల్యాల: రూరల్ మండలం మోర పల్లికి చెందిన శ్యామల ఇటీవల ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి పడి తీవ్రగాయాలపాలైంది. కరీంనగర్‌లో చికిత్సపొందుతున్న ఆమెను ఐఎంఏ స్టేట్ ప్రెసిడెంట్ డాక్టర్ బీఎన్.రావు పరామర్శించారు. ఆమెకు అండగా ఉంటామని, ఆస్పత్రి చార్జీలు తగ్గించేలా చూడాలని యాజమాన్యానికి సూచించారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే చర్యలు



కవర్లు స్వాధీనం చేసుకుంటున్న సిబ్బంది

మెట్‌పల్లి: నిషేధిత ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే చర్యలు తప్పవని ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్ పేర్కొన్నారు. పట్టణంలోని పలు దుకాణాల్లో సోమవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా పలుచోట్ల ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకుని రూ.4వేలు జరిమానా విధించారు. సిబ్బంది విష్ణు, ముజీబ్ తదితరులున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సభ్యత్వం స్వీకరిస్తున్న సీపీఐ నాయకులు

జగిత్యాల: ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సీపీఐ పట్టణ కన్వీనర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం సీపీఐ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. సీపీఐ పార్టీ సభ్యులకు, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తుందన్నారు.

మాతృభాష ఎంతో గొప్పది



అ ఆ ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

జగిత్యాల: మాతృభాష ఎంతో గొప్పదని జ్యోతి హైస్కూల్ డైరెక్టర్ హరిచరణ్‌రావు అన్నారు. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా ముందస్తు వేడుకలు నిర్వహించి మాట్లాడారు. ప్రతీ ఒక్కరు తెలుగు భాషపై పట్టు సాధించాలని, తెలుగు భాష గొప్పతనాన్ని ప్రతీఒక్కరికి వివరించాలన్నారు. అనంతరం విద్యార్థులు తెలుగు వర్ణమాలలోని అక్షరాలు అ ఆ ఆకారంలో కూర్చుని తెలుగు భాష గొప్పతనాన్ని చాటారు.

కౌన్సిలర్ నిరసన



నిరసన తెలుపుతున్న కౌన్సిలర్ సునీత

రాయికల్: పట్టణంలోని 8వ వార్డులో మురుగుకాలువ నిర్మాణం తొలగించాలని పలుమార్లు మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని దీంతో శనివారం అధికారుల పనితీరుకు నిరసనగా కౌన్సిలర్ కల్లెడ సునీత కాలువ వద్ద నిరసన తెలిపారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్న ట్లు పేర్కొన్నారు. బీజేపీ నాయకులు లక్ష్మీకాంతం, సుమన్, సందీప్ వెంట ఉన్నారు.

ప్రజా గోస- బీజేపీ భరోసా



మేడిపెల్లి: భీమారం మండలం కాచారంలో సోమవారం ప్రజాగోస, బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రజావ్యతిరేక వైఖరి, ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం వంటి అంశాలతో పాటు కేంద్రప్రభుత్వం తెచ్చిన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల బీజేపీ మండల అధ్యక్షుడు ముంజ శ్రీనివాస్, క్యాతం దశరథ్‌రెడ్డి,మధూకర్, జగన్‌రెడ్డి, ఇజ్రాయేల్, తదితరులు పాల్గొన్నారు.

పనులు పూర్తయ్యేదెప్పుడో?

- క్రీడా ప్రాంగణం పనుల్లో జాప్యం
- స్థల సమస్యతో నాలుగు గ్రామాల్లో ప్రారంభించని పనులు
- మిగిలిన గ్రామాల్లో పూర్తికాని వైనం
- పనులు పూర్తిచేయాలంటున్న యువత



సంగెం గ్రామంలో ఏర్పాటుచేసిన క్రీడాప్రాంగణం

కోరుట్లరూరల్: గ్రామాల్లో క్రీడాకారులకు ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణా క్రీడా ప్రాంగణం పనులు మండలంలో నత్తనడకన సాగుతున్నాయి. మండలంలో 15 గ్రామాలుండగా 11 గ్రామాల్లో పనులు అసంపూర్తిగా మిగిలాయి. నాలుగు గ్రామాల్లో స్థల సమస్యతో పనులు ప్రారంభించలేదు. దీంతో గ్రామాల్లో క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. దీంతో పనులు ప్రశ్నార్థకంగా మారాయి.

క్రీడా ప్రాంగణల్లో సౌకర్యాలు..

గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న క్రీడా ప్రాంగణాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, లాంగ్‌జంప్ క్రీడా కోర్టులతో పాటు డబుల్, సింగిల్ ఎక్సర్‌సైజ్ బార్‌లు ఏర్పాటు చేస్తారు. క్రీడా ప్రాంగణాల కోసం ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ స్థలాలను బట్టి ఎకరం నుంచి 20 గుంటల స్థలం కేటాయించారు. ఆయా గ్రామాల్లో కేటాయించిన స్థలాలను బట్టి రూ.1 లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు ఖర్చుచేసి ఆటస్థలాలు నిర్మించాల్సి ఉంటుంది. ఇందులో రూ.25 వేలతో సామగ్రి, మిగతా డబ్బులతో స్థలం చదును, మట్టి పోయడం, కూలీలకు చెల్లించాల్సి ఉంటుంది. ఆటస్థలం చుట్టూ సుమారు 200 మొక్కలు నాటాల్సి ఉంటుంది. కాగా పలు గ్రామాల్లో పూర్తిస్థాయిలో పనులు పూర్తి కాలేదు. 1,2 గ్రామాల్లో స్థలాలు చిన్నగా ఉండడంతో పల్లె ప్రకృతి వనాలు, పాఠశాలల్లో రెండేసి కోర్టులు ఏర్పాటు చేస్తున్నారు.

నాలుగు గ్రామాల్లో స్థల సమస్య..

యూసుఫ్‌నగర్, సర్పరజ్‌పల్లె, తిమ్మయ్యపల్లె, కిషన్‌రావు పల్లెల్లో ప్రభుత్వ స్థలాలు లేక పనులు ప్రారంభించలేదు. యూసుఫ్‌నగర్ గ్రామంలోరెవెన్యూ అధికారులు స్థలం కేటాయించినప్పటికీ ముస్లింలు తమకు ఖబరస్తాన్ కోసం స్థలం కావాలని చెబుతుండడంతో స్థలసమస్య అలాగే ఉంది. సర్పరాజ్‌పల్లెలో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో పల్లె ప్రకృతి వనం, పాఠశాలల్లో రెండేసి చొప్పున కోర్టులు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. అదేవిధంగా తిమ్మయపల్లెతో పాటు కిషన్‌రావుపల్లె గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో తెలంగాణా క్రీడా ప్రాంగణం పనులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని తమ గ్రామాల్లో క్రీడాప్రాంగణాలకు స్థల సమస్య పరిష్కారంతో పాటు స్థలాలు ఉన్న గ్రామాల్లో త్వరగా పనులు పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని గ్రామీణ యువకులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం



గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న క్రీడా ప్రాంగణాలు తుది దశకు చేరాయి. చిన్న చిన్న పనులు త్వరగా పూర్తి చేయిస్తాం. ప్రాంగణం చుట్టూ హరితహారంలో భాగంగా మొక్కలు నాటిస్తాం. త్వరలోనే క్రీడాప్రాంగణాలను అందుబాటులోకి తెస్తాం.

– నీరజ, ఎంపీడీవో

స్థల సమస్య పరిష్కరిస్తాం



యూసుఫ్‌నగర్‌లో క్రీడా ప్రాంగణం నిర్మాణానికి కేటాయించిన స్థలం సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం. తిమ్మయపల్లె, కిషన్‌రావుపల్లె, సర్పరాజ్‌పల్లె గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు లేవు. క్రీడా స్థలాల సేకరణకు గ్రామస్తులతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం.

– నీరటి రాజేశ్, తహసీల్దార్

త్వరగా పూర్తి చేయాలి



మా ఊరిలో క్రీడా ప్రాంగణం పనులు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తేవాలి. దీంతో క్రీడాకారులకు ఇబ్బందులు తొలగుతాయి. ఉపయోగపడతాయి. పట్టణాలకు వెళ్లి ప్రాక్టీస్ చేసే వీలుండదు. కాబట్టి దగ్గరలోనే అందుబాటులో ఉంటే అనుకూలంగా ఉంటుంది.

– దొమ్మటి మహిత్, పైడిమడుగు

కనుల పండువగా రథోత్సవం



రాయికల్: రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



మల్లాపూర్‌లో శ్రీకనక సోమేశ్వర స్వామి రథోత్సవం

రాయికల్: మండలంలోని కొత్తపేట శ్రీరాజరాజేశ్వరస్వామి నాగాలయంలో సోమవారం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. అర్చకులు రాజేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేసి అనంతరం రథంపై ఆలయం చుట్టూ తిప్పారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సతీమణి రాధిక ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలుచేశారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, సర్పంచ్ రాజేశం, వెంకమ్మ, తిరుపతి, ఎంపీటీసీ శ్రీనివాస్, ఆలయ కమిటీచైర్మన్ ప్రవీణ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ రమాదేవి, పాలకమండలి సభ్యులు రాజిరెడ్డి, రాజేశం, రంజిత్, నర్సయ్య, ధర్మరాజు, రాజం ప్రతాప్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, రాంరెడ్డిపాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

రాయికల్ మండలంలోని అల్లీపూర్ గ్రామంలో శివపార్వతుల కల్యాణం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అర్చకులు అంగడి భువనేశ్వర్ ఆలయంలోని ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేసి కల్యాణం జరిపించారు. గ్రామంలోని భక్తులు కల్యాణంలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లావుడ్యా సంధ్యారాణి, సర్పంచ్ అత్తినేని గంగారెడ్డి, ఎంపీటీసీ మోర విజయలక్ష్మీ, ఉపసర్పంచ్ సాగర్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ రాజలింగం, ఆలయకమిటీ చైర్మన్ నామని శేఖర్, అనుమల్ల మహేశ్, సతీశ్, లక్ష్మీనర్సయ్య, అజిత్, శ్రీహరి, రాజు, సుమన్ పాల్గొన్నారు.

శ్రీ కనక సోమేశ్వరుని రథోత్సవం

మల్లాపూర్: మండలకేంద్రంలో శ్రీ కనక సోమేశ్వర స్వామి జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అర్థరాత్రి ఆలయకమిటీ ఆధ్వర్యంలో అశేష భక్తజనం మధ్య రథోత్సవం నిర్వహించారు. వేడుకలకు ఎస్సై నవీన్‌కుమార్ పోలీస్ సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు చేపట్టారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజన, పీఏసీఎస్ చైర్మన్ వేంపేట నర్సారెడ్డి, రైతుబంధు కమిటీ మండల అధ్యక్షుడు కొమ్ముల జీవన్‌రెడ్డి, ఎంపీటీసీలు ఆకుతోట రాజేశ్, మరిపెల్లి సత్తెమ్మ, నాయకులు క్యాతం జీవన్‌రెడ్డి పూంద్ర శ్రీనివాస్‌రెడ్డి, ముద్దం సత్యనారాయణగౌడ్, మరిపెల్లి మల్లయ్య, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుస్తాపూర్‌లో జాతర మహోత్సవం

మల్లాపూర్ మండలంలోని కుస్తాపూర్‌లో మహాశివరాత్రి సందర్భంగా స్థానిక శివాలయంలో 5 రోజులు జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల్లో భాగంగా సోమవారం తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో రాజశ్రీనివాస్, ఆర్ఐలు రాజేశ్, విశ్వనాథ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు మురళి, సురేశ్, సర్వేయర్ రవి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వీరిని సర్పంచ్ సరికెల లక్ష్మీమహిపాల్ ఘనంగా సన్మానించి స్వామి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం ఆలయం ఆవరణలో మహాఅన్నదానం ప్రారంభించారు.

మహిళల ప్రత్యేక పూజలు

జగిత్యాల: జిల్లాకేంద్రంలో సోమవారం అమావాస్య సందర్భంగా వాణీనగర్ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే బారులు తీరారు. అనంతరం హోమం వ్రతాలు సైతం చేశారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి రాధిక



కల్యాణానికి హాజరైన భక్తులు

రోడ్లు విస్తరించాలని విన్నపాలు



వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

మేడిపెల్లి: మేడిపెల్లి-భీమారం రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేసి, మేడిపెల్లి, కొండాపూర్ గ్రామాల్లో బైపాస్ నుంచి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి కోరారు. సోమవారం జగిత్యాల ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ మకరంద్‌కు వినతిపత్రం అందించారు. ఏనుగు రమేశ్‌రెడ్డి, బోమ్మెన ప్రశాంత్, చుక్క తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

డబుల్ రోడ్డుపనులు ప్రారంభించాలి

మేడిపెల్లి మండల కేంద్రం నుంచి గోవిందారం ఆర్ అండ్‌బీ డబుల్ రోడ్డు పనులు త్వరగా చేపట్టాలని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి కరండ్ల మధుకర్ డిమాండ్ చేశారు. ఈమేరకు ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. డబుల్ రోడ్డు పనులకు రూ.20 కోట్లు మంజూరై కాంట్రాక్టు పూర్తయిన పనులు చేపట్టడం లేదని వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కరీంనగర్ పార్లమెంట్ కో కన్వీనర్ దశరథరెడ్డి, జగన్, ఇజ్రాయేల్ పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీ చేయాలి

పెగడపల్లి: మండలంలోని నందగిరి గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను నిరుపేద లబ్ధిదారులను గుర్తించి పంపిణీ చేయాలని గ్రామస్తులు కోరారు. గ్రామానికి చెందిన పలువురు సోమవారం జగిత్యాల కలెక్టరెట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. గతంలో లబ్ధిదారులను గుర్తించిన వారిలో చాలామంది అనర్హులున్నారని అధికారులు విచారణ జరిపి అర్హులకు న్యాయం చేయాలని వినతిపత్రంలో కోరారు. ఉపసర్పంచ్ అశోక్‌రెడ్డి, నాయకులు గంగాధర్, వెంకటేశ్, సతీశ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎడ్లబండ్ల పోటీలు అనుభూతిని కలిగించాయి



విజేతలకు బహుమతి అందిస్తున్న జీవన్‌రెడ్డి

ధర్మపురి: మహా శివరాత్రి సందర్భంగా నిర్వహించిన ఎడ్లబండ్ల పోటీలు మంచి అనుభూతిని కలిగించాయని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. మండంలోని నేరెల్ల సాంబశివ ఆలయం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఎడ్ల బండ్ల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హాజరై పోటీలు ప్రారంభించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, నాయకులు ఎస్ దినేశ్, వేముల రాజేశ్, పీసీసీ మెంబర్ గిరి నాగభూషణం, నాయకులు కాసారపు బాలాగౌడ్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ శేర్ల రాజేశం, గోవిందుపల్లె సర్పంచ్ పురంశెట్టి రాజయ్య, జాజాల రమేశ్ తదితరులున్నారు.

నాసా కేంద్రం సందర్శనకు సిరిపూర్ విద్యార్థి

- నాసా నిర్వహించిన బ్రెయిటెస్ట్ మైండ్ ఆఫ్ వరల్డ్ పరీక్షలో గ్లోబల్ ర్యాంక్
- శ్రీహాస్‌రెడ్డి అద్భుత ప్రతిభపై హర్షం



సన్మానిస్తున్న విద్యాసంస్థల చైర్మన్ నారాయణరెడ్డి



శ్రీహాస్‌రెడ్డి

మల్లాపూర్: నాసా కేంద్రం సందర్శనకు మల్లాపూర్ మండలం సిరిపూర్ గ్రామానికి చెందిన విద్యార్థి ఎద్మల(సోమ) శ్రీహాస్‌రెడ్డి ఎంపికయ్యాడు. శ్రీహాస్‌రెడ్డి మెట్‌పల్లి పట్టణంలోని బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్‌లో పదోతరగతి చదువుతున్నాడు. గ్రామానికి చెందిన ఎద్మల(సోమ) సునీల్‌కుమార్-లక్ష్మీల కుమారుడైన శ్రీహాస్‌రెడ్డి మెట్‌పల్లి పట్టణంలోని బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నాడు. నాసా(నేషనల్ ఎరోనాటికల్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్) అమెరికా వారి ఆధ్వర్యంలో ఈనెల 16న ఆన్‌లైన్‌లో నిర్వహించిన బ్రెయిటెస్ట్ మైండ్ ఆఫ్ వరల్డ్ 5వ లెవల్ పరీక్షలో అద్భుతమైన ప్రతిభ కనబర్చి అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటాడు. నాసా ప్రకటించిన ఫలితాలల్లో జాతీయస్థాయిలో మొదటిర్యాంక్, గ్లోబల్‌లోనూ మొదటి ర్యాంక్ సాధించి అమెరికాలోని నాసా కేంద్రం సందర్శించేందుకు అర్హతసాధించాడు. సోమవారం బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆకెళ్ల ఇందిరా, డైరెక్టర్ జేవీడీ.ప్రసాద్‌రావు, ప్రిన్సిపాల్ ప్రశాంత్ గ్లోబల్ ర్యాంక్ సాధించిన శ్రీహాస్‌రెడ్డిని ఘనంగా సన్మానించి అభినందించారు. శ్రీహాస్‌రెడ్డి భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూక్య గోవింద్ నాయక్, ఎంపీటీసీ ఏనుగు రాంరెడ్డి, మాజీ సర్పంచ్‌లు సోమ లింగారెడ్డి, నల్ల బాపురెడ్డి, కిసాన్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యంరెడ్డి కుటుంబసభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు. శ్రీహాస్‌రెడ్డికి నాసా సందర్శనకు ఎంపికవడంపై బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్ ప్రత్యేకంగా అభినందించారు.

లొత్తునూర్‌లో ఎడ్లబండ్ల పోటీలు



ఎడ్లబండ్ల పోటీలు

గొల్లపల్లి: మండలంలోని లొత్తునూర్ గ్రామంలో మహా శివరాత్రి ఉత్సవాలు మూడు రోజులు అంగరంగ వైభవంగా జరిగాయి. శ్రీరాజరాజేశ్వరస్వామి జాతరఉత్సవాల్లో భాగంగా సోమవారం మూడోరోజు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎడ్లబండ్ల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొత్తం 21 ఎడ్లబండ్లు పాల్గొనగా మొదటి బహుమతి నెరేళ్ల శేఖర్‌గౌడ్ వెన్గుమట్ల సాధించగా, వీరికి గొడసంగం పావుతులం బంగారం అందించారు. రెండో బహుమతి పట్టిపాక రాజయ్య మల్లిడి గెలుపొందగా వీరికి తాండ్ర ప్రశాంత్ 8 తులాల వెండిని అందించారు. మూడో బహుమతి షేక్ బష్మీయా తీర్మాలపూర్ గెలుపొందగా వీరికి చిరుత ఉత్తరయ్య నాలుగు తులాల వెండిని దాతలు అందించారు. భక్తులకు లక్కం వెంకటాచలం నిల్లమ్మ దంపతులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మహేశ్వరి, ఎంపీటీసీ సంతోషి, మాజీ సర్పంచ్ రత్నయ్య, సత్యం, స్వామి, ఆకుల రాజు, లక్ష్మీకాంతం, తిరుపతి, సత్యం, చంద్రయ్య, సత్యం,తిరుపతి, శేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: తెలంగాణ ప్రభుత్వంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. సోమవారం మైనార్టీ రెసిడేన్షియల్ పాఠశాల ఆవరణలో రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలో ఐదు మైనార్టీ రెసిడేన్షియల్ పాఠశాలలు, కళాశాలలు ఉండగా 3,200 మంది విద్యార్థులు చదువుతున్నారని వీరికి అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఒక్కో విద్యార్థికి రూ.లక్షకు పైగా నిధులు కేటాయించామన్నారు. రాష్ట్రంలో కుల, మత వర్గాల ప్రజల అభివృద్ధి కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో వెయ్యికి పైగా గురుకులాలను ఏర్పాటు చేశామని విద్యార్థులకు సన్నబియ్యం అందిస్తున్నామన్నారు. అలాగే క్రీడల్లోనూ, ఎంసెట్, ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ రంగాల్లోనూ ఉచిత శిక్షణ అందిస్తున్నామన్నారు. పార్టీ అధ్యక్షుడు సతీశ్, హమీద్, ప్రిన్సిపాల్ రాజేందర్, మొగిలి, వెంకటేశ్, మహేశ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు అండగా నిలవాలి



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి/ఇబ్రహీంపట్నం: అన్నివర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేస్తోందని ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉండాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు కోరారు. ఇబ్రహీంపట్నం మండలానికి చెందిన పలువురు పటణంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. నియోజకవర్గంలో ప్రతీ గ్రామాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. జెడ్పీటీసీ భారతి, ఎంపీపీ జాజాల భీమేశ్వరి, ఎలాల దశరత్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఎలేటి చిన్నారెడ్డి ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలు అభివృద్ధి చెందాలి

ఇబ్రహీంపట్నం: మహిళా సంఘాలు అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అన్నారు. సోమవారం ఇబ్రహీంపట్నంలో మహిళా సంఘాల సభ్యులకు ట్రాక్టర్ అందించారు. యంత్రాలు కొనుగోలు చేసి పంటలు పండించే స్థోమతలేని సన్న చిన్నకారు రైతులకు రోటోవెటర్ ట్రాక్టర్‌ను అద్దెకు ఇచ్చి మహిళా సంఘాలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. దీంతో రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని, మండల సమాఖ్యకు కొంత ఆదాయం కూడా లభిస్తుందన్నారు. రైతుల కోసం సేవకేంద్రాలు అందుబాటులోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో సెర్ప్ సంస్థ అడిషనల్ డీఆర్‌డీవో రోనాల్డ్ సుధీర్, ఏపీఎం శంకర్, ఎంపీపీ జాజాల భీమేశ్వరి, జెడ్పీటీసీ భారతి, సర్పంచు నేమూరి లత, మండల కోఆప్షన్ సభ్యుడు ఎలేటి చిన్నారెడ్డి, ఎంపీటీసీ తిమ్మణి రాములు, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఇబ్రహీంపట్నం మండలంలోని 17 గ్రామాలకు గాను 16 గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 4.52 కోట్లతో చేపడుతున్న సీసీరోడ్లకు, 4 గ్రామాల్లో జీపీ భవన నిర్మాణలకు సోమవారం ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు సుడిగాలి పర్యటన చేసి 16 గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరుట్ల నియోజకవర్గంలో ప్రతీ మండలాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం మండలంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తున్నామని నిధుల మంజూరుకు సీఎం కేసీఆర్ హామీఇచ్చారన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో 41 మందికి కల్యాణలక్ష్మి , ఐదుగురికి షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి, జెడ్పీటీసీ భారతి, తహసీల్దార్ మహేశ్వర్, ఎంపీడీవో ప్రభు, ఎంపీవో కృపాకర్, పంచాయతీ డీఈ గోపాల్, ఏఈ నిరంజన్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు ఎలేటి చిన్నారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రాయికల్ తహసీల్దార్‌గా అబ్దుల్ ఖయ్యూం



రాయికల్: మండల తహసీల్దార్‌గా మహ్మద్ అబ్దుల్ ఖయ్యూం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ కమిషనరేట్ నుంచి రాయికల్ తహసీల్దార్‌గా బదిలీచేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ



కోరుట్ల: కోరుట్ల సీఐగా ప్రవీణ్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సీఐ రాజశేఖర్‌రాజు బదిలీపై వెళ్లగా ఆయనస్థానంలో ప్రవీణ్‌కుమార్ నియమితులయ్యారు.

నియామకం

కోరుట్ల: మైనార్టీ సెల్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా మహ్మద్ రజియొద్దీన్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సోహైల్ నియామక పత్రాన్ని రజియొద్దీన్‌కు అందించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు రజియొద్దీన్‌ను అభినందించారు.